సాక్షి కృష్ణాజిల్లా

శుక్రవారం ॥ 8 ॥ నవంబర్ ॥ 2024



కబడ్డీ పోటీలు ప్రారంభం

మైలవరం: స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల కబడ్డీ (మహిళలు) పోటీలు ప్రారంభమయ్యాయి.



దుర్గమ్మ సేవలో మంత్రి సుభాష్

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మను మంత్రి వాసంశెట్టి సుభాష్ కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. అనంతరం భక్తులతో కలిసి అన్న ప్రసాదం స్వీకరించారు.



సీపీ ఆకస్మిక తనిఖీలు

పాయకాపురం(విజయవాడరూరల్): పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు గురువారం నున్న పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు.

న్యూస్‌రీల్

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్టిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. రాజగోపురం ఎదుట ధర్మపథం వేదికపై శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు కల్యాణ వేడుక జరిపించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని స్వామి ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను మేళ తాళాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. కల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణోత్సవంలో పలువురు ఉభయ దాతలు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఉత్సవ మూర్తులను ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లగా పలువురు ఉభయదాతలు, భక్తులు పల్లకీ సేవలో పాల్గొన్నారు.

డీఏవీ పాఠశాల విద్యార్థికి రాజ్య పురస్కారం



ఇబ్రహీంపట్నం: మండలంలోని కొండపల్లి దయానంద్ ఆంగ్లో వేదిక్ స్కూల్ (డీఏవీ) పదో తరగతి విద్యార్థి గుడి షారోన్ సంజయ్ రాజ్యపురస్కారానికి ఎంపికయ్యాడు. విజయవాడ రాజ్‌భవన్‌లో గురువారం జరిగిన స్కౌట్, గైడ్స్ ప్రదర్శనలో గవర్నర్ షేక్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా రాజ్యపురస్కారం అందుకున్నాడు. రాజ్‌భవన్‌లో జరిగిన స్కౌట్, గైడ్స్ ప్రదర్శనలో షారోన్ సంజయ్ ఉత్తమ ప్రదర్శన ఇచ్చాడు. ఏటా జిల్లాలో ఒకరికి అందజేసే ఈ పురస్కారం ఈ ఏడాది తమ విద్యార్థికి దక్కడంపై డీఏవీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మన్మోహన్, స్కౌట్ ఉపాధ్యాయుడు యోగాశ్వరరావు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేశారు. షారోన్‌సంజయ్‌ను అభినందించారు.

సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: బాస్కెట్‌బాల్, క్యారమ్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల రాష్ట్ర జట్లను ఇందిరాగాంధీ స్టేడియంలో గురువారం ఎంపిక చేసినట్లు ఎన్టీఆర్ డీఎస్‌డీఓ ఎస్.ఎ.అజీజ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 316 మంది క్రీడాకారులు ఎంపిక పోటీలకు హాజరయ్యాయని పేర్కొన్నారు. కోచ్‌లు శ్రీనివాసరావు, బి.కె.రుద్ర, వెంకయ్య, సిరాజుద్దీన్, రవికుమార్, జగదీష్, కల్యాణి, ఎతిరాజ్, లోవ పాపారావు పర్యవేక్షణలో జట్లను ఎంపిక చేశారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిద్దాం



లబ్బీపేట(విజయవాడతూర్పు): క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా నివారణ సులభతరం అవుతుందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వేంకటేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎన్‌సీడీ–సీడీ విభాగం ఆధ్వర్యంలో గురువారం క్యాన్సర్‌పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పాత ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో నిర్వహించిన ఈ ర్యాలీని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసినితో కలిసి సూపరింటెండెంట్ డాక్టర్ వేంకటేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 18 ఏళ్లు నిండిన వారికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయడంతో పాటు, లక్షణాలు ఉన్న వారిని గుర్తించి చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్యాన్సర్ 3 సర్వే ద్వారా సమాజంలో ప్రాథమిక దశలో వ్యాధి గుర్తింపు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ–సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మాధవీనాయుడు, ఆర్‌ఎంఓలు డాక్టర్ శ్రీనివాసరాజు, డాక్టర్ యు.శోభ, డాక్టర్ పద్మావతి, డాక్టర్ ఆశా పర్వీన్, డాక్టస్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దాళ్వా.. సాగేదెలా..?

- జలాశయాల్లో పుష్కలంగా నీటి నిల్వలు
- రబీకి సాగునీటి విడుదలపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం

జిల్లాలో 20 వేల హెక్టార్లలో వరిసాగుకు అవకాశం



ఇటీవల దాళ్వాకు నీరు ఇవ్వాలని బంటుమిల్లిలో ఆందోళన చేసిన రైతులు (ఫైల్)



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో దాళ్వా సాగుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ ఏడాది రబీ సీజన్‌లో వరిసాగుకు నీటి విడుదలపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటనా రాకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. దాళ్వాలో వరి సాగుపై రైతులు కోటి ఆశలతో ఉన్నారు. ఈ నెలాఖరు నాటికి ఖరీఫ్ సీజన్ ముగియనుంది. ఇప్పటికే వరికోతలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో రబీ సీజన్‌లో వరిసాగుకు నీటిని విడుదల చేసే అంశంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేస్తే ఏ రకం పంటలు సాగు చేయాలనే అంశంపై రైతులు ఆలోచన చేసుకునే అవకాశం ఉంటుంది. ఖరీఫ్‌లో వాతావరణ పరిస్థితులు అనుకూలించక వరదలు, అధిక వర్షాల కారణంగా దిగుబడులు తగ్గాయి. కనీసం రబీ సీజన్‌లో అయినా రెండో పంటగా వరి సాగు చేసుకుని కొంత మేర ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

వరిసాగుపై రైతుల ఆసక్తి

రబీ సీజన్‌లో జిల్లాలో సుమారు 20 వేల హెక్టార్లలో వరి సాగు చేసుకునే అవకాశం ఉంది. మచిలీపట్నం, పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో వరిసాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. ప్రకాశం బ్యారేజీతోపాటు, ఎగువునున్న అన్ని జలాశయాల్లో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ సాగునీటి విడుదలలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎటువంటి ప్రకటనలూ చేయడంలేదు. దీంతో రబీలో ఏ పంట సాగు చేసుకోవాలనే ఆలోచనలో రైతులు మల్లగుల్లాలు పడుతున్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు ఈ మండలాల్లో రబీలో వరిసాగు చేయలేదు. దీంతో మినుము, ఉలవలు, నువ్వులు, పంట పండిన చోట మాత్రమే సాగు చేస్తున్నారు. మిగిలిన పొలాలు ఎటువంటి సాగు చేయకుండా ఖాళీగానే మిగిలిపోయాయి. ప్రతి సంవత్సరం సాగునీటి సలహా మండలి సమావేశం ఏర్పాటు చేసి జిల్లాలో ఏయే ప్రాంతాలకు రబీ సీజన్‌లో వరిసాగుకు అనుమతి ఇవ్వాలి, తీరప్రాంతంలో వేసవిలో తాగు నీటి అవసరాలు తీర్చేందుకు ఎంతమేర నీటిని కాలువలకు విడుదల చేయాలి. సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తదితర అవసరాలను బేరీజు వేసుకుని ప్రజాప్రతినిధులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే ఆ దిశగా కూటమి ప్రభుత్వ పాలకులు ఎటువంటి సమావేశం ఏర్పాటు చేయాలని ఆలోచన కూడా చేయకపోవటం రైతుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రబీలో సాగునీరు విడుదల చేసి వరి సాగుకు అనుమతులు ఇస్తే అందుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయశాఖ అధికారులు ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియ కోసం పాలకులు ఏ విధంగా రైతులకు తోడ్పాటును అందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

ధాన్యం కొనుగోలు చేయాల్సి వస్తుందని..

ఖరీఫ్‌లో ఇప్పటికే కోతలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పండిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతోంది. ఈ ప్రక్రియ మార్చి వరకు కొనసాగే అవకాశం ఉంది. వరదలు, అధిక వర్షాల కారణంగా దిగుబడి తగ్గాయి. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలుతో పాటు రాబోయే రబీసీజన్‌లో వరిసాగుకు అనుమతి ఇస్తే ఆ ధాన్యం కూడా తామే కొనుగోలు చేయాల్సి వస్తుందని పాలకులు ఆలోచన చేస్తున్నట్లుగా తెలుస్తోంది. రబీ సీజన్‌లో వరి సాగుకు అనుమతి ఇవ్వాలని ఇటీవల బంటుమిల్లిలో రైతులు ఆందోళన చేశారు. దాళ్వాకు అనుమతి ఇవ్వకపోతే తమ భూములు బీడువారే అవకాశం ఉందని ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి వరిసాగుకు అనుమతి ఇచ్చి తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

చౌడు భూములుగా మారతాయి



రబీ సీజన్‌లో వరి పంటకు సాగునీరు ఇవ్వకపోతే తమ భూములన్నీ చౌడుబారే అవకాశం ఉంది. రాబోయే ఖరీఫ్ పంట కూడా పండే అవకాశం ఉండదు. తీరప్రాంత మండలాల్లోని రైతుల ఆవేదనను అర్థం చేసుకుని పాలకులు, అధికారులు రబీలో వరిసాగు చేసుకునేలా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి.

– పిన్నెంటి విశ్వేశ్వరరావు, యండపల్లి, కృత్తివెన్ను మండలం

రూ.250 కోట్లతో ఫైర్ స్టేషన్ల ఆధునికీకరణ

మొవ్వ: అగ్నిమాపక కేంద్రాలను రూ.250 కోట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిధులతో ఆధునికీకరణ చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన మొవ్వ అగ్ని మాపక కేంద్రాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం శ్రీనివాసరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. తన పరిధిలోని కేంద్రాల్లో ఉన్న సమస్యలను పరిశీలించి వాటిని పరిష్కరించే దిశలో అధ్యయనం చేస్తున్నానని, అందులో భాగంగానే ఈ కేంద్రాన్ని తనిఖీ చేశానని తెలిపారు. రూ.250 కోట్ల నిధుల్లో 75 శాతం కేంద్ర ప్రభుత్వం, 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయని వివరించారు. ఈ నిధులతో 100 అగ్నిమాపక యంత్రాలను, 17 కొత్త స్టేషన్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని పేర్కొన్నారు. చిన్న చిన్న సందుల్లో జరిగే అగ్ని ప్రమాదాలను సైతం అరికట్టే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రాష్ట్రంలో తొలి సారిగా రూ.3.5 కోట్లతో హజ్మత్ వాహనాన్ని కొనుగోలు చేసి భారీ ప్రమాదాలను అరికట్టడానికి చర్యలు తీసుకున్నామని వివరించారు. పరిశ్రమల్లో భారీ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని అదుపులోకి తీసుకురావడం కోసం 25 మంది సిబ్బందికి గుజరాత్ రాష్ట్రంలో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. భారీ అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో సమాచారం తక్షణం చేరేందుకు విజయవాడలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. తొలుత సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫైర్ ఆఫీసర్ జి.ఏసురత్నం, మొవ్వ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫైర్ వాహనాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ డైరెక్టర్

రోగ నిర్ధారణలో రేడియాలజీ కీలకం

- రేడియాలజీలో విప్లవాత్మకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్
- వైద్య రంగంలో కీలకంగా మారిన రేడియాలజిస్టులు
- గుండెపోటు, మెదడుపోటు, లివర్, కిడ్నీ, క్యాన్సర్‌ల నిర్ధారణలో కీలకం
- ఉమ్మడి కృష్ణాలో 150 మందికిపైగా రేడియాలజిస్టులు
- నేడు ప్రపంచ రేడియాలజీ డే



లబ్బీపేట(విజయవాడతూర్పు): గుండె పోటు, మెదడు పోటు, క్యాన్సర్, కడుపు నొప్పి, మెదడులో కణితి.. ఇలా వ్యాధి ఏదైనా నిర్ధారించేది రేడియాలజిస్టులే. గర్భంలో ఉన్న శిశువు ఆరోగ్యం నుంచి వృద్ధాప్యంలో వచ్చే వ్యాధుల వరకూ నిర్ధారణలో వారిదే కీలకపాత్ర. పాతకాలపు ఎక్స్‌రే నుంచి నేటి డిజిటల్ ఎక్స్‌రే, ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్‌లు, అల్ట్రా సౌండ్ స్కాన్ ఇలా అనేక ఇమేజింగ్ పరికరాలు నేడు వైద్య రంగంలో కీలకభూమిక పోషిస్తున్నాయి. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సూక్ష్మ దశలో ఉన్న వ్యాధులను కూడా గుర్తించగలుగుతున్నారు. గుండె, మెదడు, కిడ్నీల పనితీరు తెలుసుకోవడంతో పాటు, వాటికి రక్త ప్రసరణ జరిగే రక్త నాళాల్లో పూడికలను సైతం ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్‌లతో గుర్తిస్తున్నారు. మెదడులో, కడుపులో కణుతులు వంటి ప్రాణాంతక వ్యాధులను తొలిదశలో నిర్ధారిస్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో దాదాపు 150 మంది వరకూ రేడియాలజిస్టులు సేవలు అందిస్తున్నారు.


రేడియాలజీ డే ప్రాముఖ్యత

వైద్య విధానంలో వస్తున్న నూతన ఆవిష్కరణలు, రేడియాలజిస్టుల పాత్రపై చర్చించుకోవడంతో పాటు, ప్రజలకు అవగాహన కలిగించేందుకు ఏటా నవంబర్ ఎనిమిదో తేదీన ప్రపంచ రేడియాలజీ దినం నిర్వహిస్తారు. తొలుత 2012లో యూరోపియన్ సొసైటీ ఆఫ్ రేడియాలజీ(ఇఎస్‌ఆర్), అమెరికన్ కాలేజ్ ఆఫ్ రేడియాలజీ(ఏసీఆర్), రేడియాలజికల్ సొసైటీ ఆఫ్ నార్త్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించారు. వీటితో పాటు ఇండియన్ రేడియాలజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్, 20 నార్త్ అమెరికన్, 12 లాటిన్ అమెరికల్ అసోసియేషన్‌లు, 10 ఏషియన్ సొసైటీలు పాల్గొంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రేడియాలజిస్టులు, రేడియోగ్రాఫర్లు, పరిశోధకులు ఒకచోట కలుసుకుని 19వ శతాబ్దం నాటి ఎక్స్‌రేను కనిపెట్టిన విల్ హెల్మ్ కానార్డ్ రౌంటజన్ సేవలు స్మరించుకోవడంతో పాటు, ఏటా ఒక నినాదంతో ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారు.

సూక్ష్మదశలో వ్యాధుల గుర్తింపు

ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, హైబ్రీడ్ ఇమేజింగ్ ఏకీకరణ ద్వారా రేడియాలజీ ఎంతో పురోగతిని సాధించింది. ఇది రోగ నిర్ధారణ, చికిత్సా సామర్థ్యాలను పెంచుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

- ఏఐ అప్లికేషన్లు ఇప్పుడు రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్, ఊపిరితిత్తుల నోడ్యూల్ డిటెక్షన్, వర్క్ ఫ్లో క్రమబద్ధీకరించడం కోసం ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా క్యాన్సర్, గుండె రక్త నాళాల సమస్యలను గుర్తించడంలో కీలకంగా మారింది.
- మాలిక్యులర్ హైబ్రీడ్ ఇమేజింగ్, హైబ్రిడ్ టెక్నిక్‌లు ముందస్తుగా వ్యాధిని గుర్తించడం, వివరణాత్మక కణితి దశలను తెలియచేస్తాయి. క్యాన్సర్ చికిత్సకు ఈ విధానం అమూల్యమైనదిగా చెపుతున్నారు.
- అమిలాయిడ్ ప్లేక్ ఇమేజింగ్ ద్వారా అల్జీమర్స్‌ను ముందస్తుగా గుర్తించడంలో సహాయపడతాయి.
- ఇంటర్వెన్షనల్ రేడియాలజీ, రోబోటిక్స్‌లు కణితి అబ్లేషన్, వాస్కులర్ ఇంటర్వెన్షన్ వంటి ప్రాంతాల్లో అధిక కచ్చితత్వాన్ని, కనిష్టంగా ఇన్వాసిస్ ఇమేజ్ -గైడెడ్ విధానాలు ఇప్పుడు సహాయపడతాయి. గుండె రక్తనాళాల్లో స్టెంట్‌లను అమర్చడంలో రోబోటిక్ సహాయం సంక్లిష్ట ప్రమాదాలను తగ్గిస్తుంది.



రోజూ వెయ్యి మందికి స్కానింగ్‌లు

ఉమ్మడి కృష్ణా జిల్లాలో రేడియాలజిస్టులు నిత్యం వెయ్యి మందికిపైగా రోగులకు ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్‌లు చేస్తుంటారు. వాటిలో 800 వరకూ సీటీ స్కాన్‌లు, 200లకు పైగా ఎంఆర్‌ఐ స్కానింగ్‌లు చేస్తుంటారు. ఒక్క విజయవాడ ప్రభుత్వాస్పత్రిలోనే రోజుకు 200 సీటీ స్కాన్‌లు, 30కి పైగా ఎంఆర్‌ఐ స్కానింగ్‌లు చేస్తున్నారు. మరో వెయ్యి మందికిపైగా అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు నిర్వహిస్తుంటారు. ఎన్టీఆర్ జిల్లాలో రేడియాలజిస్టులు నిర్వహించే ఇమేజింగ్ అండ్ స్కానింగ్ సెంటర్‌లు 150 వరకూ ఉండగా, కృష్ణాజిల్లాలో మరో 40 వరకూ ఉన్నాయి.

ముందుగానే గుర్తిస్తున్నాం



ఆధునిక టెక్నాలజీని జోడించి మెదడు పోటు వచ్చే లక్షణాలను ముందుగానే గుర్తిస్తున్నాం. రోగులు అప్రమత్తమై తగు వైద్యం పొంది మెదడుపోటుకు గురయ్యే ప్రమాదం నుంచి బయటపడుతున్నారు. మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్, గర్భాశయంలో గడ్డలను 4డీ టెక్నాలజీ అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా సూక్ష్మదశలో గుర్తిస్తున్నాం. ఫలితంగా క్యాన్సర్‌కు తొలిదశలోనే వైద్యం పొందుతూ, వ్యాధిని జయించగలుగుతున్నారు.

– డాక్టర్ దీప్తిలత, రేడియాలజిస్టు, విజయవాడ

ఏఐతో పెనుమార్పు



రేడియాలజీలో ఏఐ వంటి అత్యాధునిక టెక్నాలజీతో పెను మార్పులు వచ్చాయి. వ్యాధిని నిర్ధారించడమే కాకుండా, లక్షణాలను సైతం ముందస్తుగానే గుర్తించి రోగిని అప్రమత్తం చేయగలుగుతున్నాం. ప్రస్తుతం సీటీ, ఎంఆర్‌ఐ యాంజియోలు అందుబాటులోకి వచ్చాయి. శరీరంలోని క్యాన్సర్ కణాలను గుర్తించే పెట్ స్కాన్‌లో కూడా ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. కచ్చితత్వంతో కూడిన వ్యాధి నిర్ధారణ చేయడంతో వైద్యంలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు.

– డాక్టర్ వి.ఎస్.వరప్రసాద్, జాతీయ అధ్యక్షుడు, ఐఆర్‌ఐఏ

నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ




శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

పెడన: భవిష్యత్ తరాలకు కూడా నిరంతర విద్యుత్ సరఫరాకు పెడన, బంటుమిల్లి, గన్నవరంలో నిర్మిస్తున్న ఉప విద్యుత్ ఉప కేంద్రాలు దోహదపడతాయని కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ అన్నారు. పెడన తోటమూలలోని 132/33 కేవీ స్విచ్చింగ్ కేంద్రం, కూడూరు వద్ద నిర్మిస్తున్న ఉప విద్యుత్ కేంద్రం నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ, పెడన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌తో సీఎం మాట్లాడారు. అనంతరం పెడన నుంచి కలెక్టర్ మాట్లాడుతూ.. పెడన, గన్నవరంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రస్తుతం మచిలీపట్నం, పామర్రు ప్రాంతాల నుంచి పెడనకు విద్యుత్ సరఫరా అవుతోందని పేర్కొన్నారు. ఎక్కువ దూరం నుంచి సరఫరా చేయడంతో ఓల్టేజ్ సమస్యలు ఎదురవుతున్నాయని వివరించారు. పెడన ప్రాంతంలో నాలుగు వేల మంది ఆక్వా రైతులు ఉన్నారని, లో ఓల్టేజ్ సమస్యతో విద్యుత్ మోటార్లు కాలిపోయి నష్టాలను ఎదుర్కొంటున్నారని, ఉప విద్యుత్ కేంద్రం అందుబాటులోకి వస్తే ఈ సమస్య తొలగి పోవడంతోపాటు, 54 వేల ఇళ్లకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని పేర్కొన్నారు. మచిలీపట్నం పోర్టు, ఇండస్ట్రియల్ విద్యుత్ అవసరాలకు కూడా ఈ సబ్ స్టేషన్ ఉపయోగ పడుతుందన్నారు. గన్నవరం సబ్ స్టేషన్ నిర్మాణంతో విజయవాడ, విజయవాడ రూరల్, గన్నవరం మండలాల్లో 3.5 లక్షల మంది వినియోగదారులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి ఒక ఫీడర్ కేటాయించడం హర్షణీయమన్నారు. వ్యవసాయానికి 9 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు విద్యుత్ సమస్యలు తొలగుతాయన్నారు. అనంతరం ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మీడియాతో మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యుత్తు ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఏపీ సీపీడీసీఎల్ ఎస్ఈ సత్యానందం, ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ భాగ్యరాజ్, జెడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకటనగేష్, నడుపూరు సర్పంచ్ చీర్ల అనూష, మచిలీపట్నం ఆర్డీఓ కె.స్వాతి, తహసీల్దారు కె.అనిల్‌కుమార్, మునిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, మచిలీపట్నం విద్యుత్ ఈఈ శ్రీనివాసరావు, ఏడీఈ సీహెచ్ మాణిక్యలరావు, టీడీపీ నాయకులు బొడ్డు వేణుగోపాలరావు, శెలపాటి ప్రసాద్, యక్కల శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్, రైస్‌కార్డు ఉంటేనే ఉచితం

జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గీతాంజలిశర్మ చిత్రంలో డీఎస్‌ఓ పార్వతి

చిలకలపూడి(మచిలీపట్నం): రైస్‌కార్డు, గ్యాస్ కనెక్షన్ ఉన్న వారు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దీపం–2 పథకం కింద ఉచిత సిలిండర్ పొందేందుకు అర్హులని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. తన చాంబర్‌లో ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందేందుకు జిల్లాలోని ప్రజలకు కొన్ని సందేహాలు ఉన్న నేపథ్యంలో వాటిని నివృతి చేసేందుకు తాను వివరాలను వెల్లడిస్తున్నానన్నారు. ముందుగా ఉచిత సిలిండర్ పొందేందుకు గ్యాస్ ఏజెన్సీకి ఆన్‌లైన్ ద్వారా గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసుకోవాలన్నారు. అనంతరం సిలిండర్ తీసుకెళ్లేటప్పుడు మొత్తాన్ని చెల్లించిన అనంతరం 48 గంటల్లోపు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఆ మొత్తం వారి వ్యక్తిగత ఖాతాకు జమ అవుతుందని తెలిపారు. బియ్యం కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, ఈ–కేవైసీ నమోదు చేసి ఉండాలన్నారు. గ్యాస్ కనెక్షన్‌తో బ్యాంకు ఖాతా వివరాలు అనుసంధానం కాకపోతే గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది వినియోగదారుని ఇంటి వద్దకే వచ్చి ఈ–కేవైసీ చేసుకుంటారని ఆమె తెలిపారు. ఇప్పటికే ఈ–కేవైసీ నమోదుపై గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 1.30 లక్షల మంది గ్యాస్ సిలిండర్ల కోసం బుక్ చేసుకున్నారని, 70 వేల సిలిండర్లను వినియోగదారులకు డెలివరీ చేశామని వివరించారు. ఈ పథకం పొందటంలో ఎవరికైనా అనుమానాలు, సందేహాలు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 1967కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వి.పార్వతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

11న ఉయ్యూరులో జాబ్‌మేళా

ఉయ్యూరు: ఈనెల 11న ఉయ్యూరు బస్టాండు సమీపంలోని శ్రీలంకకాలనీలోని ఎస్‌ఏసీ ట్రెనింగ్ సెంటరులో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఒకేషనల్ ఉపాధి కల్పన అధికారి సత్యబ్రహ్మం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్ కుమార్ గురువారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనశాఖ, డిఆర్‌డిఏ-సీడాప్, ఎస్‌ఏసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో బీజెడ్ ఫిన్సర్వ్, పేటిఎం ఇతర ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని వివరించారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన 18 ఏళ్ల నుంచి 35ఏళ్ల లోపు యువతీ యువకులు ఈజాబ్‌మేళాకు హాజరు కావచ్చన్నారు. ఇతర వివరాలకు 79813 68429, 93923 45939 నంబర్లను సంప్రదించాలని వారు సూచించారు.

అప్రంటీస్ మేళా

గుడివాడరూరల్: ఈనెల 11వ తేదీన గుడివాడలోని కెబిఆర్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ప్రధానమంత్రి నేషనల్ అప్రంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి తెలిపారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై అప్రంటీస్ అభ్యర్థులను ఎంపిక చేస్తాయన్నారు. ఐటీఐ పాసై అప్రంటీస్ పూర్తి కాని అన్ని ట్రేడుల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని, ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఆమె సూచించారు.

- సీఆర్‌జెడ్ పరిధిలో యథేచ్ఛగా ఇసుక అక్రమరవాణా
- పులిగడ్డలో రాత్రిళ్లు ఇసుక తవ్వకాలు
- వందకి పైగా ట్రాక్టర్ల ద్వారా తరలింపు
- పోలీసులపై ఇసుక మాఫియా దౌర్జన్యం
- భయపడిపోతున్న పోలీసు, రెవెన్యూ యంత్రాంగం



ఇటీవల ఆముదార్లంక గ్రామస్తులు పట్టుకున్న ట్రాక్టర్లు(ఫైల్)

ఎవడ్రా.. మనల్ని ఆపేది?

దివిసీమలో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

అవనిగడ్డ: దివిసీమలో ఇసుక మాఫియా రోజురోజుకు రెచ్చిపోతోంది. సీఆర్‌జెడ్ పరిధిలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణాను తెగబడింది. వీరి ఆగడాలకు పోలీసు, రెవెన్యూ యంత్రాంగం హడలిపోతోంది. రెండు రోజుల నుంచి పులిగడ్డలో పెద్దఎత్తున ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా అధికారులెవ్వరూ పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమరవాణాపై పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో వార్తలు వస్తున్నా ఎవడ్రా మమ్మల్ని ఆపేది అంటూ ఇసుక మాఫియా మరింత రెచ్చిపోతోంది.



ఆముదార్లంక నుంచి రాత్రివేళల్లో సాగుతున్న ఇసుకరవాణా

ప్రకటనలకే పరిమితమా?..

ఇసుక అక్రమతవ్వకాలు, మద్యం అక్రమ అమ్మకాల్లో జనసేన, టీడీపీ నాయకులు కలుగజేసుకోవద్దని స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేస్తున్న వ్యాఖ్యలు కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే ప్రకటనలకే పరిమితం కావడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు..

ప్రభుత్వం అవనిగడ్డ నియోజకవర్గం ఘంటసాల మండలంలో శ్రీకాకుళంలో మాత్రమే రెండుచోట్ల ఇసుక రీచ్‌లకు అనుమతులిచ్చింది. ప్రస్తుతం వరద నీరు ఉండటంతో ఈప్రాంతంలో ఇసుక తవ్వకాలకు అవకాశం లేదు. అవనిగడ్డ పులిగడ్డ రేగుల్లంకలో రెండురోజుల నుంచి రాత్రిళ్లు పెద్ద ఎత్తున ఇసుక అక్రమరవాణా చేస్తున్నారు. సీఆర్‌జెడ్ (కోస్టల్ రెగ్యులేటర్ జోన్) పరిధిలో ఉన్న ఈ ప్రాంతంలో వందకు పైగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా సాగుతున్నప్పటికీ అధికారులు ఆవైపు కన్నెత్తి చూడటం లేదు. అవనిగడ్డ మండలం దక్షిణ చిరువోలులంక, తుంగల వారిపాలెం, ఎడ్లంక, నాగాయలంక మండలం టి.కొత్త పాలెం, నవలంక, మోపిదేవి మండలం కోసూరువారిపాలెం, పెదకళ్ళేపల్లి, కె.కొత్తపాలెం, చల్లపల్లి మండలం ఆముదార్లంక, నిమ్మగడ్డ, ఘంటసాల మండలం పాపవినాశనం, శ్రీకాకుళం, కోడూరు మండలం విశ్వనాధపల్లి, కుమ్మరిపాలెంలో పెద్దఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి.

దౌర్జన్యానికి పాల్పడుతున్న అక్రమార్కులు..

చల్లపల్లి మండలం ఆముదార్లంకలో ఇటీవల ఇసుక అక్రమరవాణాకు పాల్పడుతున్న 30ట్రాక్టర్లను గ్రామస్తులు పట్టుకుని పోలీసులు, రెవెన్యూ అధికారులకు అప్పగిస్తే అధికారులు వాటిని వదిలేశారు. మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్ పేషీల నుంచి ఫోన్లు రావడంతో అధికారులు ఆయా ట్రాక్టర్లను వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బాపట్ల జిల్లా పరిధి గ్రామాలకు ఆనుకుని ఉన్న ఈగ్రామంలో ఈ ఇసుక మాఫియా వెనుక టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు ఉండటంతో ఇసుక మాఫియాకు అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. చల్లపల్లి మండలం నిమ్మగడ్డలో ఇసుక అక్రమరవాణాదారులు రెవెన్యూ, పోలీసు సిబ్బందిపై దౌర్జన్యం చేయడంతో కేసులు నమోదయ్యాయి. చల్లపల్లి, అవనిగడ్డకు ఇసుక ట్రాక్టర్లను తరలించేందుకు అధికారులు సిద్ధపడగా, ట్రాక్టర్ డ్రైవర్లు అంగీకరించకుండా ఇసుక ట్రాక్టర్లను తరలించుకుపోవడం గమనార్హం. ఇలా నియోజకవర్గంలో ఓ యువనేత అండదండలతో యథేచ్ఛగా సాగుతున్న ఇసుక అక్రమరవాణాకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు, ప్రభుత్వ పాలకులు విఫలమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ డీకె బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రజలకు ఇబ్బంది కలిగించేలా నిత్యావసర సరుకులను దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ డీకె బాలాజీ హెచ్చరించారు. ఆయన గురువారం తన చాంబర్‌లో జిల్లా స్థాయి ధరల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. నిత్యావసర సరుకుల ధరలు బహిరంగ మార్కెట్, రైతుబజారులో ఏవిధంగా అమ్మకాలు జరుపుతున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకే నిత్యావసర సరుకులను ప్రజలకు విక్రయించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ధరల్లో ఏమాత్రం తేడా వచ్చినా ఉపేక్షించేది లేదన్నారు. నాణ్యత విషయంలో కూడా రాజీపడబోమన్నారు. జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సరసమైన ధరలకు నిత్యావసరాలను అందించాలన్నారు. ప్రత్యేక కౌంటర్ ద్వారా కందిపప్పు కిలో రూ.150, సోనా మసూరి బియ్యం కిలో రూ.48, సోనామసూరి బీపీటీ రా బియ్యం రూ.47 చొప్పున వినియోగదారులకు విక్రయిస్తున్నామన్నారు. సన్‌ఫ్లవర్ నూనె ప్యాకెట్ లీటరు రూ.124, పామోలిన్ లీటరు రూ. 114 చొప్పున విక్రయిస్తున్నామన్నారు. వీటితోపాటు సూపర్‌మార్కెట్, హోల్‌సేల్, రిటైర్ దుకాణాల్లో కూడా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే వినియోగదారులకు విక్రయించాలని వ్యాపారులకు సూచించారు. దుకాణాలను తనిఖీ చేసి తూకం, వస్తువుల నాణ్యతలో ఏమైనా తేడాలు ఉన్నాయా, లేదా గమనించాలని తూనికలు, కొలతలు అధికారికి సూచించారు. ప్రస్తుతం రైతుబజారులో టమాటా కిలో రూ.30, ఉల్లిపాయలు (కర్నూలు) రూ.33, ఉల్లిపాయలు (షోలాపూర్) రూ.42లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డీఎస్‌వో వి.పార్వతి, జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి ఎస్. పద్మావతి, మార్కెటింగ్ ఏడీ ఎల్.నిత్యానందం, సీటీవో వి.వెంకటేశ్వరరావు, తూనికలు, కొలతల అధికారి రాజేంద్రప్రసాద్, పలు వ్యాపారసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



వ్యాపారులు, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకె బాలాజీ చిత్రంలో జేసీ గీతాంజలిశర్మ

ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన

విజయవాడ రూరల్: సిమెంటు రోడ్ల నిర్మాణం విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ శాఖ ఎన్టీఆర్ జిల్లా సూపరిండింటెంట్ ఇంజినీరు జెడ్.రమేష్ సూచించారు. విజయవాడలోని జలవనరులశాఖ రైతుశిక్షణా కేంద్రంలో గురువారం జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న సిమెంటు రోడ్ల నిర్మాణపు పనుల్లో పాటించాల్సిన నాణ్యతా ప్రమాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ జెడ్.రమేష్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో 80.99కోట్లతో 533 సిమెంటు రోడ్లను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఈపనులను సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేయాలన్నారు. రోడ్ల నిర్మాణం లో నూటికి నూరుశాతం నాణ్యత పాటించాలన్నారు. సిమెంటు, ఇసుక, కంకర మిక్సింగ్, క్యూరింగ్ విషయాల్లో ఎక్కడా రాజీ పడవద్దన్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించిన సందర్భంలో ఎక్కడా ఎలాంటి లోపం కనిపించకుండా రోడ్ల నిర్మాణాలు ఉండాలని స్పష్టం చేశారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఎంతో బాధ్యతతో విధులను నిర్వహించాల్సి ఉందన్నారు. సాంకేతిక నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. సదస్సులో క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఏడుకొండలు, ఏపీ ఆర్‌ఆర్‌బీ సలహాదారులు ప్రభాకర్‌రెడ్డి, నరసింహారావు, డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్ సూపరిండింటెంట్ ఇంజినీర్ జెడ్.రమేష్

గ్యాంగ్‌వార్ నిందితులు తొమ్మిదిమంది అరెస్ట్

పెనమలూరు: యనమలకుదురులో రెచ్చిపోయి దాడులకు దిగిన గ్యాంగ్‌వార్ సభ్యుల్లో తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు.పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు..యనమలకుదురులో ఇరువర్గాలకు చెందిన యువకులు పరస్పరదాడులకు పాల్పడగా, ఈ ఘటనపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఇందులో ఓ వర్గానికి చెందిన పెదపూడి మనోజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామలింగేశ్వరనగర్‌కు చెందిన వెన్నా ప్రేమ్, వెన్నా జశ్వంత్, దాసరి వెంకటసాయికుమార్, పి.రాకేష్, అచ్యుత రోహిత్, యనమలకుదురుకు చెందిన జంపాన శివనాగ సతీష్, జి.రాహుల్‌వెంకటసాయి, ఎస్.రవితేజ, ఉప్పర్ల సాయికుమార్‌ని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. గ్యాంగ్ వార్‌కు సంబంధించి మొత్తం 16మందిని గుర్తించామన్నారు. మిగిలినవారు పరారీలో ఉన్నట్లు సీఐ వివరించారు.

ఇరువురికి నేత్రదానం

పామర్రు: చనిపోయి కూడా ఇరువురికి నేత్రాలను దానం చేసిన సంఘటన పామర్రులో గురువారం చోటుచేసుకుంది. కృష్ణాజిల్లా పామర్రు గ్రామంలోని బాలికల పాఠశాల పక్కనే ఉంటున్న కొల్లి ఉమావతి(85) గురువారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు. మృతురాలి కోరిక మేరకు కుటుంబసభ్యులు ఆమె కళ్లను దానం చేయాలని నిర్ణయించారు. విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి సమాచారం తెలియజేయగా, టెక్నీషియన్ సాయి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది మృతురాలి నేత్రాలను సేకరించారు. స్థానిక డాక్టర్ పీ సురేష్‌చంద్రరెడ్డి ప్రోత్సాహం అందించారు. నాగాయలంకకు చెందిన సుదర్శి మానవతా సేవాసంస్థ నుంచి తలశిల రఘుశేఖర్, మృతురాలి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



నేత్రాల దాత కొల్లి ఉమావతి

నేటి నుంచి రాష్ట్ర రోయింగ్ జట్ల ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: 44వ జూనియర్, 7వ జాతీయ ఛాలెంజర్ రోయింగ్ ఛాంపియన్‌షిప్‌కు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్లను ఈనెల 8, 9, 10 తేదీల్లో జంగారెడ్డిగూడెంలోని శాప్ వాటర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఎంపిక చేయనున్నట్లు ఏపీ రోయింగ్, స్కల్లింగ్ సంఘం అధ్యక్షులు, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో తరుణ్ కాకాని తెలిపారు. నూతన క్రీడా విధానం, ఎస్ఎస్‌డీసీ ప్రకారం జట్లను అత్యంత పారదర్శంగా ఎంపిక చేస్తామన్నారు. 15 నుంచి 17ఏళ్ల లోపు వయసున్న బాలబాలికలు ఈ పోటీలకు అర్హులన్నారు. ఎంపికై న జట్లు డిసెంబర్ ఒకటి నుంచి ఆరోతేదీ వరకు పూణెలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటాయన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు కోచ్ కృష్ణమూర్తి(సెల్‌నంబరు 8331873037)ను సంప్రదించాలని ఆయన సూచించారు.

బైక్ దొంగలకు ఏడాది జైలు

విజయవాడస్పోర్ట్స్: మొగల్రాజపురంలోని డిజిటల్ స్టూడియో ఎదుట పార్క్ చేసిన బైక్‌ను దొంగిలించినవారికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ విజయవాడ ఒకటో అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి సయ్యద్ జియాఉద్దీన్ గురువారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. ఈ ఏడాది ఫిబ్రవరి మూడో తేదీన స్టూడియోలో పనిచేసే వ్యక్తి బైక్‌ను దొంగిలించిన ఘటనపై సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితులు గుంటూరుజిల్లాకు చెందిన షేక్ ఆసీఫ్, జాస్తి వెంకటసాయి, ప్రకాశంజిల్లాకు చెందిన మైదుకూరి ఆసీఫ్‌పై నేరం రుజువు కావడంతో వారికి ఏడాదిపాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు.

భార్యను హతమార్చిన భర్త

దూళ్ళవానిగూడెం(పెదపారుపూడి): క్షణికావేశంలో ఓభర్త, తన భార్యను కడతేర్చిన సంఘటన మండలంలోని పాములపాడు శివారు దూళ్ళవానిగూడెంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వేమూరి లక్ష్మీబాయిమ్మ (67) తన దగ్గర ఉన్న గ్యాస్ సిలిండర్‌ను తన కుమార్తె మాణిక్యంకు ఇచ్చింది. విషయం తెలుసుకున్న భర్త వేమూరి వెంకటేశ్వరరావు రాత్రి 11గంటల సమయంలో తన తెలియకుండా గ్యాస్‌బండ ఎందుకు ఇచ్చావంటూ భార్యతో వాగ్వాదానికి దిగాడు. క్షణికావేశంలో వెంకటేశ్వరరావు, తనభార్య లక్ష్మీబాయిమ్మను మెడపై పట్టుకుని మంచం కోడెకు వేసి కొట్టాడు. దీంతో ఆమె అక్కడిక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని మాయం చేసే ఉద్దేశంతో దుస్తుల్లో చూట్టి దగ్గరలో ఉన్న రైల్వేపట్టాలపై పడవేయానికి వెళ్తుండగా, గ్రామస్తులు చూసి ప్రశ్నించారు. దీంతో మృతదేహాన్ని వదలి పారిపోయాడు. మృతురాలి కుమారుడు వేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.




మృతురాలు లక్ష్మీభాయిమ్మ

పోర్టు పనుల పురోగతిపై సమీక్ష

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులను నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని కలెక్టర్ డీకె బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తనచాంబర్‌లో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మతో కలిసి గురువారం ఆయన పోర్టు నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. డ్రెడ్జింగ్, నార్త్, సౌత్ బ్రేక్ వాటర్, బెర్త్‌లు, రోడ్డు, సీటి సరఫరాకు పైప్‌లైన్, పరిపాలనా భవనాల నిర్మాణ పనులు పూర్తయ్యే కార్యాచరణ ప్రణాళికను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబరు 2025 నాటికి పోర్టు నిర్మాణ పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించిన నేపథ్యంలో ప్రత్యేక దృష్టిపెట్టి ఆ సమయానికి పూర్తి చేయాలన్నారు. త్వరలో పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని తాను సందర్శిస్తానన్నారు. పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన యంత్రాలు, మ్యాన్ పవర్ ఉపయోగించాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఆర్వో బి శ్రీదేవి, మెగా ఇంజినీరింగ్ సంస్థ జనరల్ మేనేజర్ తులసీదాస్, మారిటైం బోర్డు డీఈ ఎం.శివయ్య, ఆర్డీవో కె .తి, ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నటరాజ్, తహసీల్దార్ మధుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

గుడ్లవల్లేరు: స్థానిక బీసీ కాలేజీ హాస్టల్ సమీపంలో పోల్‌రాజ్ కాల్వలో ఓ యువకుడి మృతదేహం పోలీసులకు గురువారం లభ్యమైంది. ఎస్ఐ సత్యనారాయణ కథనం మేరకు..అన్నం పూర్ణ చంద్రశేఖరరావు(30)తనతండ్రి సత్యనారాయణ ప్రసాద్ కొద్దిరోజుల కిందట మృతి చెందడంతో మనస్తాపంతో ఉండేవాడు. ఉద్యోగరీత్యా నిత్యం ఉయ్యూరుకు వెళ్లే చంద్రశేఖరరావు బుధవారం కూడా ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులు పోల్‌రాజ్ కాల్వలో విగతజీవుడై అనుమానస్పద స్థితిలో మృతిచెంది ఉన్న చంద్రశేఖరరావును గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుడివాడ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానస్పద కేసుగా నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.



చంద్రశేఖరరావు మృతదేహం

నవజాతశిశువులకు అరుదైన గుండె శస్త్రచికిత్సలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పుట్టుకతోనే అరుదైన గుండె సమస్యలు ఉన్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు నవజాత శిశువులకు విజయవాడలోని ఆస్టర్ రమేష్ ఆస్పత్రిలో గుండె సర్జరీలను విజయవంతంగా నిర్వహించారు. వారిద్దరికీ ట్రాన్స్‌పొజిషన్ ఆఫ్ గ్రేట్ ఆర్టరీస్ అనే గుండెవ్యాధి ఉండగా, ఆర్టీరియల్ స్విచ్ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శస్త్రచికిత్సల వివరాలను పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వాసుదేవ్ వెల్లడించారు. నాలుగు, ఐదునెలల వయస్సుగల చిన్నారులను ఒడిశాలోని రమేష్ ఆస్పత్రి అవుట్‌రీచ్ సెంటర్‌కు తీసుకు రాగా, వారికి వైద్య పరీక్షలు నిర్వహించి గుండె ధమనుల అమరిక అపసవ్య దిశలో ఉండటంతో ట్రాన్స్‌పోజిషన్ ఆఫ్ గ్రేట్ ఆర్టరీస్ అనే వ్యాధి బయటపడిందన్నారు. ఈ సమస్యతో శరీరంలో చాలా వరకూ చెడు రక్తం ప్రసరణ జరుగుతుందన్నారు. ఎంతో క్లిష్టతరమైన ఈ ఆపరేషన్లను ఆస్పత్రి పీడియాట్రిక్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ చిగురుపాటి భరత్ సిద్ధార్థ్ విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఇద్దరు శిశువులు కోలుకుని ఆరోగ్యంగా ఉన్నట్లు వివరించారు. ఇప్పటి వరకూ నైజీరియా, కాంబోడియా, టర్కీ, బంగ్లాదేశ్, పాకిస్థాన్ నుంచి వచ్చిన చిన్నారులకు గుండె శస్త్ర చికిత్సలు చేశామన్నారు. ఇప్పుడు ఒడిశా చిన్నారులు పూర్తిగా కోలుకుని వెళ్తున్నారని డాక్టర్ వాసుదేవ్ అన్నారు. సమావేశంలో హాస్పటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ నాదెళ్ల గిరిబాబు, డాక్టర్ జ్యోతి ప్రకాష్, డాక్టర్ కత్తుల అనూష తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

విజయవాడస్పోర్ట్స్: మూడురోజులుగా పటమటలోని సీహెచ్‌ఆర్‌కే ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కాసా వడ్లమూడి మోహనకృష్ణ మెమోరియల్ అండర్-13 బాలబాలికల రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఫైనల్స్‌లో క్రీడాకారులు మధ్య పోరు రసవత్తరంగా సాగింది. బాలుర సింగిల్స్‌లో సాయిసోహాన్, ఎం.జస్వంత్, డబుల్స్‌లో జి.షణ్ముకవర్ధన్-ఎం.జస్వంత్ జోడి, సిహెచ్.మహిధర్‌రెడ్డి-టి.వర్షిత్ జోడి, బాలికల సింగిల్స్‌లో ఎస్.మనస్వి, డి.ఆశాశ్రీ, డబుల్స్‌లో జి.వెంకటలతారెడ్డి-శ్రీరామ్‌కావ్య జోడి, డి.ఆశాశ్రీ-ఎస్.మనస్వి జోడి వరుసగా విన్నర్, రన్నర్ ట్రోఫీలు అందుకున్నారు. విజేతలకు ఏపీ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి డాక్టర్ పి.అంకమ్మచౌదరి, రిటైర్డ్ లెక్చరర్ అడుసుమిల్లి శ్రీనివాసరావు, ఛాంపియన్‌షిప్ ఆర్గనైజింగ్ సెక్రటరి వడ్లమూడి హరికృష్ణ ట్రోఫీలను అందజేశారు.



విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న నిర్వాహకులు

ప్రభుత్వరంగ కంపెనీల పునరుద్ధరణకు డిమాండ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌ను అత్యంత స్కిల్డ్ లేబర్‌గా గుర్తించి కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ డిమాండ్ చేసింది. విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. ధర్నాలో పెద్దసంఖ్యలో మెడికల్స్ రిప్స్ పాల్గొన్నారు. ధర్నానుద్దేశించి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ రంగ మందుల కంపెనీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మందులు, వైద్య పరికరాలపై జీఎస్టీ ఎత్తివేయాలన్నారు. వేజ్ బోర్డు ఏర్పాటు చేసి కనీసం వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ అమలుచేయాలన్నారు. ఈ చట్టాన్ని అమలుచేయని యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు, లేబర్ కోడ్స్ రద్దు చేసి కార్మికచట్టాలను అమలు చేయాలని కోరారు. మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు చట్టబద్ధమైన పనివిధానాలు కల్పించాలన్నారు. ఆరోగ్య రంగానికి జీడీపీలో 5శాతం నిధులు కేటాయించాలన్నారు. రిప్స్ ధర్నాకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, వామపక్ష నాయకులు సీహెచ్ బాబూరావు, ఏఎం గఫూర్, అజయ్‌కుమార్ మద్దతు ప్రకటించారు. మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ధర్నాలో యూనియన్ నాయకులు యు.వి.కృష్ణయ్య, ఎస్.రవికుమార్, ట్యాక్స్ పేయర్స్ అసోయేషన్ కార్యదర్శి ఆంజనేయులు, జి. వెంకటేశ్వర్లు, రాజు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకట్రావు

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ దుర్మరణం

తిరువూరు: మండలంలోని చౌటపల్లి శివారు టేకులపల్లి వద్ద విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేస్తూ ఓ ప్రైవేటు ఎలక్ట్రీషియన్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. జీకొత్తూరుకు చెందిన పగడాల వెంకటేశ్వరావు(45) ఏపీఎస్‌పీడీసీఎల్ లైన్‌మెన్‌కు సహాయకుడిగా ఉంటున్నాడు. లైన్‌మెన్ గానుగపాడు విద్యుత్ సబ్‌స్టేషను నుంచి అనుమతి తీసుకోకుండానే వెంకటేశ్వరరావును విద్యుత్ మరమ్మతుల కోసం స్తంభం ఎక్కించగా, విద్యుదాఘాతానికి గురై అతను మృతిచెందాడు. లైన్‌మెన్ నిర్లక్ష్యం కారణంగానే వెంకటేశ్వరరావు మరణించాడని ఆరోపిస్తూ అతని మృతదేహాన్ని తిరువూరు సమీపంలోని లక్ష్మీపురం సబ్‌స్టేషన్ ఎదుట ఉంచి కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆందోళనకు చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతుడు వెంకటేశ్వరరావుకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.



సబ్‌స్టేషన్ వద్ద ఆటోలో ఉంచిన వెంకటేశ్వరరావు మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కుటుంబసభ్యులు

విద్యుత్ ప్యానెల్‌పడి యువకుడి మృతి

ఉంగుటూరు: ప్రమాదవశాత్తు విద్యుత్ ప్యానల్ బోర్డు మీదపడటంతో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు..గన్నవరం మండలం వీరపనేనిగూడెం ఇండస్ట్రియల్ ఏరియాలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లౌలేష్(20) ఐదునెలలుగా పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం మరో హెల్పర్ శివప్రసాద్‌తో కలసి రిమోట్‌కంట్రోల్‌తో అనుసంధానమైన క్రేన్‌తో ఒక విద్యుత్ ప్యానల్ బోర్డును కదిలిస్తున్నారు. ఆ సమయంలో తన చేతిలో ఉన్న రిమోట్ కిందపడిపోయింది. దీంతో క్రేన్ ఒక్కసారిగా పక్కకు జరిగింది. క్రేన్ మోస్తున్న ప్యానల్ బోర్డు అదుపుతప్పి కిందపడబోతుండగా లౌలేష్ దానిని ఆపబోయాడు. ప్యానల్ బోర్డు బరువు ఆపుకోలేక లౌలేష్ కిందపడటంతో అతని తలకు తీవ్రగాయమైంది. సహ ఉద్యోగులు, కంపెనీ యాజమాన్యం లౌలేష్‌ను సమీపంలోని పిన్నమనేని ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. సహఉద్యోగి శివప్రసాద్ ఫిర్యాదు మేరకు ఆత్కూరు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లౌలేష్(ఫైల్)